శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

స్పందన వినతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

–జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి



చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ

భాకరాపేట: స్పందనలో వచ్చే వినతులపై అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని చిత్తూరు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రికార్డులు, సిబ్బంది హాజరు సహా పలు రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి రోజు ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా తప్పనిసరిగా ముఖ హాజరు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రోజువారి ఉత్తర ప్రత్యుత్తర కార్యకలాపాలను పర్సనల్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న బీసీ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: బీసీ సంక్షేమ సంఘం నేత ఎ.కిరణ్ కుమార్ గౌడ్, ఏపీ బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాయలసీమ అధ్యక్షుడు జి.వాసుకుమార్ మంగళవారం చెన్నారెడ్డి కాలనీలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించడంతో పాటు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ నిర్వాహకురాలు పి.కిరణ్‌కుమారి, బీసీ సంఘ నేతలు కె.నాగరాజు, టి.సోమశేఖరాచారి, జయచంద్ర, కె.సురేంద్ర యాదవ్, త్రినాథ్ గౌడ్, శశికుమార్ పాల్గొన్నారు.

ఏజీపీగా వెంకట రామయ్య



తిరుపతి లీగల్: తిరుపతి జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ప్రభుత్వం తరఫున సివిల్ కేసులు వాదించడానికి తిరుపతి న్యాయవాది ఎస్‌జీ వెంకటరామయ్యను నియమిస్తూ రాష్ట్ర న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. న్యాయవాది వెంకటరామయ్య తిరుపతిలో సుమారు 20 ఏళ్లుగా న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి కార్పొరేషన్ వైస్ చైర్మన్ అభినయరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు, ఇతర ప్రముఖులు ఆయన్ను అభినందించారు.

మున్సిపల్ స్కూల్‌కు వంట పాత్రలు వితరణ



వంటి పాత్రలు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి కొర్లగుంట సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ స్కూల్‌కు వైఎస్సార్‌సీపీ 9వ డివిజన్ అధ్యక్షుడు ఆదం సుధాకర్ రెడ్డి, వాసలిప్రసాద్ రూ.20 వేలు విలువ చేసే వంటసామాన్లు వితరణగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు రాగి జావను అందించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కాసీం(చోట), సుబ్బు, హెచ్‌ఎం ధనంజయులునాయుడు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



జేసీబీతో మొక్కలను తొలగిస్తున్న సీఐ

చంద్రగిరి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు సీఐ ఓబులేసు తెలిపారు. మంగళవారం శ్రీనివాస మంగాపురం నుంచి రైల్వే గేటు వరకు రోడ్డుకిరువైపుల ఉన్న ముళ్లపొదలు, చెట్లను తొలగించారు. ఈ మార్గంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించడంతో ప్రాథమిక చర్యల్లో భాగంగా ముళ్లపొదలను తొలగించినట్లు ఆయన తెలిపారు. వాహనాదారులు నిబంధనలు పాటించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి వాటికి పాల్పడకూడదని సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్య



గుర్తుతెలియని వృద్ధుడు

చంద్రగిరి: ఉరేసుకుని గుర్తు తెలియని వృద్ధుడు (62) ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని నరసింగాపురం శ్మశాన వాటికలో మంగళవారం చోటుచేసుకుంది. మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రవీంద్ర, ఏఎస్‌ఐ సుధాకర్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తెల్లచొక్కా, గోధుమ రంగు పంచె ధరించి ఉన్నాడని, ఎడమ చేతిపై శూలం గుర్తు పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆధారాలు లభించకపోవడంతో పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న ఉపాధ్యాయులు

చంద్రగిరి: పదో తరగతికి సంబంధించిన ప్రశ్నపత్రాలు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. ప్రశ్నపత్రాలను ట్రంకు పెట్టెల్లో భద్రపరిచి సీలు వేశారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని.. ఆయా పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈఓ లలిత కుమారి తెలిపారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం



రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ శిరీష

చంద్రగిరి: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ శిరీష అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతి ఒక్క ఓటరు తమ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈ మేరకు బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. డీటీలు మోహన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, అమృత, ఆర్ఐ సులోచన పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

–ఒకరి అరెస్టు



అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి అలిపిరి: భాకరాపేట రేంజి పరిధిలో మంగళవారం ఉదయం తొమ్మిది ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం భాకరాపేట రేంజ్ చామల ఈస్ట్ బీట్ పరిధిలోని నాగపట్ల సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం కూంబింగ్ చేపట్టారు. అన్నదమ్ముల బండ వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరిని పోలీసులు పట్టుకున్నారు. తిరుపతి పేరూరు గ్రామం శ్రీనివాసపురానికి చెందిన సిద్ధరపు శ్రీనివాసులురెడ్డిగా గుర్తించారు. అతనితో పాటు వచ్చిన రేణిగుంట కురకాల్వకు చెందిన మణికంఠ, కర్ణాటకకు చెందిన వశీం పరారీలో ఉన్నారు. శ్రీనివాసులురెడ్డిపై గతంలో ఐదు కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. 205 కిలోలు ఉన్న 9 దుంగల విలువ రూ.2.10 లక్షలు ఉంటుందని చెప్పారు. సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూంబింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి కర్నూలు రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ రివార్డులు ప్రకటించారు.

సీఎంకు రుణపడి ఉంటాం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

పాకాల: నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మేలు ఎప్పటికీ మరచిపోమని.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆ సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం పాకాల ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేవదాయశాఖ ఆలయ పాలకవర్గంలో స్థానం కల్పించడం, దేవాలయాల్లో పని చేసే క్షురకులకు రూ.20 వేలు కనీస వేతనం ప్రకటించడం, కుల దూషణ చట్టాన్ని అమలు పరచడం, బార్బర్ షాపులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు జీఓ విడుదల చేయడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి యుగంధర్, తిరుపతి జిల్లా కన్వీనర్ సురేంద్ర, సంఘం మండల అధ్యక్షుడు కేశవులు, ప్రచార కార్యదర్శి పరమశివం, నాయకులు కృష్ణయ్య, బుజ్జి, రామనాథం, భాస్కరయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో ఉగాది సంబరాలు

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలోని వీసీ చాంబర్‌లో బుధవారం ఉదయం 9గంటలకు ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మొండిబకాయిల వసూలుకు వినూత్న నిరసన



హోటల్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తిరుపతి తుడా: నగరంలో మొండిబకాయిల వసూళ్లపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ఏళ్ల తరబడి మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న వారి భవనాల వద్ద రెవెన్యూ సిబ్బంది నిరసనకు దిగుతున్నారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మొండి బకాయిదారుల భవనాల వద్ద సచివాలయ సిబ్బందితో కలిసి నిరసన తెలిపారు. మొండి బకాయిదారులకు మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. అయినా స్పందించకపోవడంతో ఈ తరహా చర్యలకు దిగారు. దీంతో ఒక రోజే నగరవ్యాప్తంగా రూ. 32 లక్షలు వసూలు అయినట్లు రెవెన్యూ ఆఫీసర్ కేఎల్ వర్మ తెలిపారు.

నేడు ప్రోగ్రెసీవ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ప్రారంభం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రోగ్రెసీవ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్‌ను బుధవారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవ సలహాదారుడు వి.కిరణ్, అధ్యక్షురాలు రాధ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. నేటి దైనందిన జీవన విధానాల ద్వారా మానసిక రుగ్మతులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇందుకు సరైన మార్గనిర్దేశనం లేకపోవడమే కారణమని తెలిపారు. ఇలాంటి వారిలో మనోస్థైరాన్ని నింపేందుకు తాము ఉచితంగా కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు అప్పారావు, రేవతి, మౌనిక, జనార్దన్ పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానంతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే చర్యలకు పాల్పడుతోందని, దీనికి అందరూ వ్యతిరేకించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ, ప్రస్తుత ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్, భాస్కర్ పిలుపునిచ్చారు. ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 92వ అమరత్వ స్మారక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పీడీఎస్‌యూ కార్యాలయంలో వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పీడీఎస్‌యూ చేపట్టే పోరాటాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిశేషు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరేంద్ర ప్రసాద్, వినోద్, మహేష్ పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టండి


రేణిగుంట డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

రేణిగుంట: రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో విమానాశ్రయం, రైల్వేస్టేషన్, పారిశ్రామిక వాడలు, జాతీయస్థాయి విద్యాసంస్థలు, గుడిమల్లం వంటి పురాతన ఆలయాలు, జాతీయ రహదారి ఉన్న నేపథ్యంలో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాలని తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను ఆరా తీశారు. అనంతరం ఆయన రేణిగుంట డీఎస్పీ రామచంద్రకు పలు సూచనలు చేశారు. డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్ పిళ్లై పాల్గొన్నారు.

రాగి జావతో రక్తహీనత నివారణ

- నగర మేయర్ డాక్టర్ శిరీష
- విద్యార్థులకు జావ పంపిణీ


తిరుపతి: నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులక రాగి జావ పంపిణీ చేస్తున్న నగర మేయర్ శిరీష


విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న హెచ్ఎం దామోదరం


అంగన్‌వాడీలోని పిల్లల తల్లులకు మిల్లెట్స్‌తో వంటల తయారీ విధానాన్ని వివరిస్తున్న సూపర్‌వైజర్

తిరుపతి ఎడ్యుకేషన్: రాగి జావను తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. మంగళవారం ఎస్పీజేఎన్ఎం నగరపాలక హైస్కూల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దారని చెప్పారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు మించిన వసతులతో తీర్చిదిద్దారన్నారు. పాఠశాల వ్యవస్థను ప్రక్షాళన చేశారన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యే కాకుండా వారి ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ జగనన్న గోరుముద్దతో రుచి, శుచితో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లల్లో రక్తహీనతను నివారించడానికి రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. రాగి పిండిలో పొటాషియం, మినరల్స్, బెల్లంలో ఐరన్ ఉంటుందని, ఈ జావ పిల్లల్లో రక్తహీనతను నివారించి వారి ఆరోగ్యానికి తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఎంఈఓ ప్రభాకర్ రాజు, స్థానిక కార్పొరేటర్ బసవ గీత, హెచ్ఎం మునిశేఖర్ పాల్గొన్నారు.

ఎంతో ఆరోగ్యకరం

తిరుపతి మంగళం: రాగి జావను అందించడం విద్యార్థులకు ఎంతో ఆరోగ్యకరమని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి అన్నారు. మంగళం తిరుమలనగర్ పంచాయతీలోని పాఠశాలలో విద్యార్థులకు రాగి జావను అందజేశారు. అలాగే రణధీర్‌పురం పంచాయతీ బీటీఆర్ కాలనీలో సర్పంచ్ లీలావతి, లక్ష్మీనారాయణ జావను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు అశోక్‌రెడ్డి, ఉమాపతి, ఏఎంసీ డైరెక్టర్ మహ్మద్‌కాసీమ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

రామచంద్రాపురం: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన విద్యార్థులకు జావ అందజేశారు. కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దామోదరం, కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలయ్య రాగి జావ పంపిణీ చేశారు. గంగిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ మనీలా ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల తల్లులకు మిల్లెట్స్‌తో వంటల తయారీ విధానాన్ని వివరించారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

చంద్రగిరి: విద్యా వ్యవస్థలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని నరసింగాపురం సింగల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తొండవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ లలిత కుమారితో కలిసి విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యకు ప్రోత్సాహం, నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. రాగిజావను తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శారీరక ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ నిరంజన్ కుమార్, హెచ్ఎం సుజాత, పాఠశాల కమిటీ చైర్మన్ కుసుమ పాల్గొన్నారు.


మంగళం రణధీర్‌పురంలో..


రామచంద్రాపురంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి


చంద్రగిరి: విద్యార్థులతోఎంఈఓ లలిత కుమారి

ఆహార భద్రత కేసు కొట్టివేత

తిరుపతి లీగల్: తిరుపతి కరకంబాడి రోడ్డులోని డీమార్ట్ పై దాఖలైన క్రిమినల్ కేసును తిరుపతి నాల్గో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కొట్టివేస్తూ తీర్పు చెప్పినట్లు న్యాయవాది పత్తికొండ మురళి తెలిపారు. కేసులోని వివరాల మేరకు.. 2016 డిసెంబర్ 27వ తేదీ జిల్లా ఆహార భద్రత అధికారులు డీమార్ట్ షాపులోని వస్తువులను పరిశీలించారు. రచనా సాల్టోపాపడ్ రింగ్స్ అనే ఆహార పదార్థానికి పరిమితికి మించి కృత్రిమ రంగును వేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై ఆహార భద్రత అధికారులు డీమార్ట్ మేనేజర్‌తోపాటు రచనా సాల్టోపాపడ్ రింగ్స్ తయారీ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. సురక్షితం కాని ఆహారపదార్థాలు విక్రయిస్తున్నందుకే వారిపై చర్యలు తీసుకోవాలని కేసులో కోరారు. ఆహార పదార్థాన్ని పరీక్ష నిమిత్తం హైదరాబాద్‌కు పంపారు. ఆ పదార్థంలో కృత్రిమ రంగు నమోదుకు మించి కలిపినట్లు నివేదికలో అధికారులు ఇచ్చారు. అయితే కోర్టులో ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలు రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి డీమార్ట్‌తో పాటు రచనా సాల్టోపాపడ్ రింగ్స్ యాజమాన్యంపై కేసు కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు.

సామాజిక కవి అన్నమయ్య

–ఆచార్య సర్వోత్తమరావు


మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు సర్వోత్తమరావు

తిరుపతి కల్చరల్: అన్నమయ్య సాహిత్యం విలక్షణమైందని, ఆయన సామాజిక కవి అని ఎస్వీయూ విశ్రాంతాచార్యులు ఆచార్య కె.సర్వోత్తమరావు తెలిపారు. అన్నమాచార్య కళా మందిరంలో అన్నమయ్య 520వ వర్ధంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. సమాజ వికాసానికి అన్నమయ్య కీర్తనలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. తెలుగు కవులు ఎందరో అన్నమయ్య సాహిత్యం నుంచి స్ఫూర్తి పొందారని తెలిపారు. తెలుగు, తమిళ, కన్నడ భాషా సాహిత్యాల్లో తగిన పరిజ్ఞానం కలిగి వైష్ణవ సంప్రదాయాలు తెలిస్తే గాని అన్నమయ్య సాహిత్యం అవగతం కాదన్నారు. రాజమండ్రికి చెందిన ఆచార్య అబ్బిరెడ్డి పేరయ్య నాయుడు అన్నమయ్య ఆధ్యాత్మికత అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణ శర్మ పాల్గొన్నారు.

భక్తి సంకీర్తన గానం

అన్నమయ్య వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన భక్తి సంకీర్తనగానం శ్రవణానందకరంగా సాగింది. ప్రాజెక్టు కళాకారిణి ఆర్.బుల్లెమ్మ గాత్ర కచ్చేరి, రఘునాథ్ బృందం సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. అలాగే మహతి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి విశాఖకు చెందిన పంతుల రమ బృందం గాత్ర కచ్చేరి, అనంతపురానికి చెందిన పట్నం శివప్రసాద్ బృందం కూచిపూడి నృత్యం అలరింపజేసింది.

ఉగాది సంబరాలు


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్: కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ముందస్తు ఉగాది సంబరాలను జరుపుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులతో వేడుకలు నిర్వహించారు. రంగవల్లులు, సంప్రదాయ నృత్యం, అంతాక్షరి, పాటలు, వంటల పోటీలతో విద్యార్థులు సందడి చేశారు.

పల్లికొండేశ్వరాలయ ఆదాయం రూ.11.68 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీపల్లికొండేశ్వరాలయ భూముల వేలం, హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.11.68 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం దేవదాయశాఖ తిరుపతి గ్రూప్‌టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజశయన ఆధ్వర్యంలో 24 రోజుల హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపు ద్వారా రూ.2,31,555లు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆలయానికి చెందిన ఊత్తుకోటలోని 0.92 సెంట్ల భూమికి నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా రూ.9.36 లక్షలు సమకూరిందన్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఆనంద్, మునివేలు, సురేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై టీడీపీ ఎమ్మెల్యేల దాడి సిగ్గుచేటు

–తీరు మార్చుకోకుంటే గుణపాఠం తప్పదు
–వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక


తిరుపతిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి కల్చరల్: అసెంబ్లీలో దళిత ప్రజాప్రతినిధులపై టీడీపీ నేతలు దాడికి పాల్పడడం సిగ్గుచేటని, తీరు మార్చుకోకుంటే ప్రజా గుణపాఠం తప్పదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగాల నేతలు హెచ్చరించారు. టీడీపీ నేతల దాడులను వ్యతిరేకిస్తూ మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ సర్కిల్లో నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి రాజేంద్ర, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రెండు, మూడు ఎమ్మెల్సీ స్థానాలు గెలవగానే టీడీపీ నేతల అరాచకాలు బయటపడ్డాయన్నారు. ఇక టీడీపీ అధికారం చేపడితే రాష్ట్రం రావణకాష్టిగా మారుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. దీన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు నాయుడు వారి అనుచర వర్గం విషపూరిత రాజకీయ కుట్రలకు తెరలేపారని.. అసెంబ్లీలో జరిగిన దాడే నిదర్శమని తెలిపారు. దళిత ఎమ్మెల్యే సుధాకర్ బాబుపై దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని సైతం ఏక వచనంతో దర్భాషలాడడం అమానుషమన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు విషపూరిత రాజకీయ కుట్రలకు స్వస్తి చెప్పకపోతే ప్రజలే గురుపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, హనుమంతనాయక్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, నాయకులు నల్లానిబాబు, ఎంవీఎస్ మణి, ఆలూరి ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.


ఎస్వీయూలో నిరసన తెలుపుతున్న దళిత సంఘం నేతలు

టీడీపీ నాయకుల ఆచారకాలకు పరాకాష్ట

టీడీపీ నేతల అరాచకాలను అడ్డుకున్న దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై దాడి చేసి అరాచకంగా వ్యవహరించడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని వ్యాఖ్యానించి దళిత వర్గాన్ని అవహేళన చేసిన చరిత్ర చంద్రబాబు నాయుడుదన్నారు. టీడీపీ హయాంలో తన సామాజికవర్గ అభ్యున్నతి తప్ప బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని కాంక్షించిన దాఖలాలు లేవన్నారు. తన ఆదేశాలతో అచ్చెం నాయుడు సారథ్యంలో అసెంబ్లీలో దుర్మార్గంగా వ్యవహరిస్తూ దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. దళిత ఎమ్మెల్యేపై దాడి చేయడమేకాక డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని సైతం దూషించడం అమానుషమన్నారు. పార్టీ నేతలు బాల, టి.దాస్, ప్రేమ్‌కుమార్, రామచంద్రయ్య, రాజేష్, రాజశేఖర్, నరేంద్ర పాల్గొన్నారు.

దారి సమస్యపై గ్రామస్తుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చిందేపల్లె గ్రామస్తులు

తిరుపతి అర్బన్: దారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ చిందేపల్లె గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనిమిది దశాబ్దాలుగా ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామానికి రాచగున్నేరి మీదుగా పుతలపట్టు–నాయుడుపేట రోడ్డుకు దారి ఉండేదని తెలిపారు. అయితే కర్మాగారానికి చెందిన యాజమాన్యం నాలుగు రోజుల క్రితం రోడ్డును మూతవేసిందని వాపోయారు. దీనిపై ప్రశ్నిస్తే మరో మార్గంలో రోడ్డును చూపిస్తామని చెప్పారని.. తాము అంగీకరించకపోవడంతో 40 మందిని అరెస్ట్ చేసి బుచ్చినాయుడుకండ్రిగ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. న్యాయం కోసం కలెక్టరేట్‌కు వచ్చామని వివరించారు.

పుంగనూరులో పైపుల పరిశ్రమ


సమావేశంలో మాట్లాడుతున్న కంపెనీ సీఈవో సురేష్‌కండేల్, పక్కన భాస్కర్‌రెడ్డి తదితరులు

- 56 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం
- రూ.165కోట్ల పెట్టుబడి.. 500 మందికి ఉపాధి
- 24 భూమిపూజకు సన్నాహాలు

పుంగనూరు : మండలంలోని ఆరడిగుంటలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం సుమారు 20వేల ఎకరాలను కేటాయించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ముందుగా రూ.165 కోట్లతో ఫెరా అలాయ్ కంపెనీని గ్రౌండ్ చేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి పైపుల కంపెనీ యాజమాన్యంతో చర్చించి, పుంగనూరు నియోజకవర్గంలో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆరడిగుంటలో ఫ్యాక్టరీ నిర్మాణానికి 56 ఎకరాలను కలెక్టర్ కేటాయించారు. అలాగే పరిశ్రమకు అవసరమైన అనుమతులు, రాయితీలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం కంపెనీ సీఈఓ సురేష్ కండేల్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

500 మందికి ఉపాధి

ఫెరా అలాయ్ పైపుల కంపెనీ ద్వారా 500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తుందని సీఈఓ తెలిపారు. పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు ఈ ప్రాంతంలో ఉందన్నారు. రెండేళ్లలో ఫాక్టరీ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.ఈ నెల 24వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చేతులమీదుగా భూమి పూజ చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో కంపెనీ చీఫ్ జీఎం దొరైరాజ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, రాయలసీమ మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్‌షరీఫ్, సచివాలయాల కన్వీనర్ కొత్తపల్లి చెంగారెడ్డి, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి పాల్గొన్నారు.


ఆరడిగుంట వద్ద పరిశ్రమ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణ అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. వాకాడు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు, పుత్తూరు, శ్రీకాళహస్తి, గూడూరు నుంచి ఈ బస్సులు నడుస్తాయన్నారు. ముందుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

వేదంలో ఒప్పో కొత్త మొబైల్ విడుదల



మొబైల్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

తిరుపతి కల్చరల్: సెంట్రల్ పార్క్‌లోని వేదం మొబైల్స్ షోరూంలో మంగళవారం ఒప్పో ఫైండ్ ఎన్2 ఫ్లిప్ మొబైల్‌ను విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ వెంకటరమణ, డీటీ జీవన్‌కుమార్ కొత్త మొబైల్‌ను ఆవిష్కరించారు. కొనుగోలుకు ఫైనాన్స్ సౌకర్యం ఉంటుందని షోరూం అధినేత ప్రభాకర్ తెలిపారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పోస్టల్ సిబ్బంది

పాకాల: స్థానిక పోస్టాఫీస్‌లో త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ని పోస్టుమాస్టర్ గుర్రప్ప మంగళవారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత సభ్యుడు మాధవ ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పోస్టాఫీస్ కార్యాలయ సిబ్బంది రాంబాబు, నిఖిల్‌సాయి, రాజ మల్లేశ్వరరావు, తులసి, స్రవంతి పాల్గొన్నారు.

హుండీలో చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్ : తిరుమల శ్రీవారి ఆలయంలోని హుండీలో బంగారు నగలు, నగదును అపహరించిన కేసులో తిరుపతి రూరల్ అవిలాల పంచాయతీ అంబేడ్కర్ కాలనీకి చెందిన ఎస్.అరుణ్‌కుమార్‌కు 49 రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటవ తేదీ శ్రీవారి హుండీలో ఓ భక్తుడు వేసిన రూ.1.45 లక్షల విలువ చేసే 72.700 గ్రాముల బంగారు నగలు, రూ.2,320 నగదును నిందితుడు అరుణ్‌కుమార్ అపహరించాడు. సీసీటీవీ ఆపరేటర్‌లు ఈ చోరీని గుర్తించి టీటీడీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చారు.

చైన్‌స్నాచర్‌కు రిమాండ్

తిరుపతి లీగల్: మహిళ మెడలో బంగారు చైన్‌ను లాక్కెళ్లిన కేసులో తిరుపతి వినాయకనగర్ డీ–టైప్ క్వార్టర్స్‌కు చెందిన మల్లి లోకేష్‌కు ఏప్రిల్ 4వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాల్గో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు లోకేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

చెక్‌బౌన్స్ కేసులో మహిళకు జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి న్యూ ఇందిరానగర్‌కు చెందిన జి.లక్ష్మికి ఆరునెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. న్యూ ఇందిరానగర్‌కు చెందిన కె.నాగరాజు వద్ద 2014 మార్చి 5వ తేదీ నిందితురాలు రూ.3లక్షలు అప్పుగా తీసుకుని ప్రొనోట్ రాసి ఇచ్చారు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2017 జూన్ 13న ఆమె చెక్కును ఇచ్చారు. చెక్కు బౌన్స్ కావడంతో బాధితుడు ఆమెపై చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆమెకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

హంస వాహనంపై కోదండరాముడి వైభవం



చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి



తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం రాత్రి హంస వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి భక్తులను అనుగ్రహించారు. రాత్రి హంస వాహన సేవ కోలాహలంగా సాగింది. ఉదయం చిన్న శేషవాహన సేవ వేడుకగా నిర్వహించారు. వాహన సేవ అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, వీజీవో మనోహర్, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఘన నివాళి



భాస్కర్‌రెడ్డి వర్ధంతిలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం: ఎర్రాతివారిపల్లెలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి 29వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, సమాధి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలతమ్మ, తల్లి పద్మావతమ్మ, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, కవితమ్మ, వేణుగోపాల్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, ఎంఆర్‌సీ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు జింకా చలపతి, పృథ్వీరెడ్డి పాల్గొన్నారు. అలాగే జోగివారిపల్లె గ్రామంలో భాస్కర్‌రెడ్డి వర్ధంతిని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి
- రెడ్డిగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం



రెడ్డిగుంటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ అభినయ్

తిరుపతి మంగళం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని.. ప్రతి ఒక్కరూ ఆయనకు అండగా నిలవాలని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతి ఒకటో డివిజన్ రెడ్డిగుంటలో మంగళవారం కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదం సాయికృష్ణారెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న మూడున్నరేళ్ల ప్రగతి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటి గడపలోకి వెళ్లి స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడు అందించలేనన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి దేశానికే ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి విద్యాదీవెన, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, పెన్షన్, రైతు రుణం, సొంతిళ్లు వంటి పథకాలతో సుమారు రూ.10లక్షల వరకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. ఇచ్చిన హామీల కన్నా ఎక్కువే సంక్షేమ పథకాలు అందించామన్నారు. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగించాలంటే జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నారాయణ, టౌన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ వాసుయాదవ్, పార్టీ నాయకులు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివయాదవ్, కృష్ణ చైతన్యయాదవ్, ప్రసాద్, బొగ్గుల వెంకటేష్, నరసింహులు, ధనశేఖర్, రామూర్తి, వంశీ పాల్గొన్నారు.

సాయంతో మానవ సంబంధాల వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పద్మనాభం

తిరుపతి ఎడ్యుకేషన్: నేటి సమాజంలో తోటి వారికి సాయం చేయాలన్న ఆలోచనా దృక్పథం సన్నగిల్లిందని, ఉన్నంతలో ఇతరులకు సాయం చేయడంతోనే మానవ సంబంధాలు వికసిస్తాయని ప్రిన్సిపల్ పద్మనాభం తెలిపారు. ఎస్వీయూలోని పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్క్ విభాగంలో మంగళవారం ''ప్రపంచ సంఘ సంక్షేమ దినోత్సవం''ను ఆ విభాగం, హెల్ప్ ఏజ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. సామాజిక సేవా దృక్పథాన్ని ప్రతి ఒకరు కలిగి ఉండాలని, అలాగే సంఘం సంక్షేమ శాస్త్రాన్ని విస్తృత స్థాయిలో తీసుకెళ్లాలని కోరారు. తిరుపతి వయోవృద్ధుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎంఎస్.రవి మాట్లాడుతూ.. వయోవృద్ధుల సమస్యలు, వారిపై సమాజం బాధ్యత, ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ టి.చంద్రశేఖరయ్య, సోషల్ వర్క్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.సాయిసుజాత, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ రీనా పాల్గొన్నారు.

న్యాయవాద సంఘం పదవులకు నామినేషన్

తిరుపతి లీగల్: తిరుపతి న్యాయవాద సంఘం కార్యవర్గ పదవులకు అభ్యర్థులు మంగళవారం నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి నలుగురు, ఉపాధ్యక్ష, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, మహిళా మెంబర్ పదవులకు ఇద్దరేసి చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. కోశాధికారి, గ్రంథాలయ కార్యదర్శి, ప్లీడర్, సాంస్కృతిక కార్యదర్శి పదవులకు మాత్రం ఒకొక్కరు నామినేషన్ వేశారు. ఈనెల 23న నామినేషన్‌ల పరిశీలన ఉంటుందని ఎన్నికల అధికారి గజేంద్ర తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

–ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
–సప్తగిరినగర్‌లో ఒరవ కాలువ నిర్మాణ పనుల పరిశీలన



సప్తగిరినగర్ పంచాయతీలో ఒరవకాలువ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం: మంగళంలోని పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. మంగళం సప్తగిరినగర్ పంచాయతీలో రూ.1.72 కోట్లతో జరుగుతున్న ఒరవకాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సప్తగిరినగర్‌లో తుడా నిధులు రూ.1.72 కోట్లు, మండల నిధులతో ఒరవకాలువ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఒరవకాలువ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారన్నారు. సర్పంచ్ నాగభూషణమ్మ, ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారని, దాంతో ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఇప్పటికే రూ. 7కోట్లతో పంచాయతీని అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ ఉమాపతి, ఎంపీటీసీ లక్ష్మయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మహ్మద్‌కాసీం, హరికృష్ణ, వార్డు సభ్యులు వెంకటసుబ్బమ్మ, దీపశ్రీ, మల్లెల నాగరాజు, మణి, సుధాకర్, రజాక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా.. మహిళల జీవితాలకు భరోసా

వైఎస్సార్ ఆసరా మహిళల జీవితాలకు భరోసా ఇస్తోందని ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. మంగళం సప్తగిరినగర్ పంచాయతీలో వైఎస్సార్ ఆసరా పొందిన మహిళలంతా ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హారతులతో నీరాజనం పలికారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి అనేక సంక్షేమ పథకాలతో సీఎం జగనన్న తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మహిళలంతా ఒక్కటై జగనన్న గెలుపునకు కృషి చేయాలని ఎంపీపీ కోరారు.

నేడు ఉగాది ఆస్థానం

నారాయణవనం: మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీశోభకృత్ నామ సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం ఉగాది ఆస్థానాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్నకు ప్రత్యేక స్నపన తిరుమంజనం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శేష వాహనంపై కొలువు దీర్చిన కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు పట్టు వస్త్రాలను సమర్పించి, ఉగాది ఆస్థానం, పంచాగ శ్రవణం నిర్వహించనున్నట్లు తెలిపారు.